

హనుమకొండ లష్కర్‌బజార్‌లోని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పూలతో స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

# మోగిన బడిగంట..

- పాఠశాలలు పునఃప్రారంభం
- పూలు, మామిడి తోరణాలతో స్కూళ్ల అలంకరణ
- విద్యార్థులకు పూలిచ్చి స్వాగతం పలికిన ఉపాధ్యాయులు
- యూనిఫాం, పాఠ్యపుస్తకాల అందజేత
- తొలి రోజు నామమాత్రంగా హాజరైన పిల్లలు

నమస్తే నెట్‌వర్క్, జూన్ 12 : వేసవి సెలవుల్లో ఆటపాటలతో సరదాగా గడిపిన విద్యార్థులు గురువారం బడి బాట పట్టారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పాఠశాలలు తెరుచుకోవడంతో ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లిదండ్రులతో కోలాహలంగా మారాయి. ఉపాధ్యాయులు పాఠశాలలను అందంగా తీర్చిదిద్దారు. విద్యాలయాల సిబ్బంది, స్వచ్ఛ వర్కర్లు తరగతి గదులను పూలు, మామిడితోరణాలు, బెలూన్స్‌తో అలంకరించారు. ఈ సందర్భంగా డీఈవోలు, ఎంఈవోలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు పూలిచ్చి స్వాగతం పలికారు. అనంతరం యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించారు. హనుమకొండ న్యూశాయంపేటలోని పోచంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభ కార్యక్రమాన్ని ఎంపీ డాక్టర్ కావ్య, కలెక్టర్ ప్రావీణ్య, డీఈవో వాసంతితో కలిసి ప్రారంభించారు. విద్యార్థులకు పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేశారు. వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తి ప్రభుత్వ పాఠశాలలో బాలలకు స్కూల్ యూనిఫామ్స్, పుస్తకాలు, నూతనంగా చేరిన వారికి వరంగల్ కలెక్టర్ సత్యశారద అడ్మిషన్ పత్రాలు అందించారు. జనగామ జిల్లా నర్మెట మండలంలోని ఆగాపేట, మాన్‌సింగ్‌తండా, కేజీబీవీలను డీఈవో భోజన్న సందర్శించి విద్యార్థులకు పూలతో స్వాగతం పలికారు. చిట్యాల మండలం నైన్‌పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భూపాలపల్లి డీఈవో రాజేందర్ పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. మహబూబాబాద్ మండలంలోని బ్రాహ్మణపల్లి లక్ష్మీపురం ప్రాథమికోన్నత పాఠశాలలో డీఈవో రవీందర్ విద్యార్థులకు పూలతో స్వాగతం పలికారు. మొదటి రోజు నామమాత్రంగా హాజరయ్యారు. కాగా, హనుమకొండ లష్కర్ బజార్‌లోని మర్కజీ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులతో తోరణాలు, పూలు కట్టించారు.



హనుమకొండ చౌరస్తా: న్యూశాయంపేట పోచంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేస్తున్న ఎంపీ కావ్య, కలెక్టర్ ప్రావీణ్య, డీఈవో వాసంతి



జనగామ రూరల్: ఎర్రకుంటతండాలో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



మర్కజీ పాఠశాలలో నోట్‌బుక్స్, యూనిఫామ్స్ అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు



కొత్తగూడ: పొగుళ్లపల్లి హైస్కూల్ గేటు వద్ద విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



మహబూబాబాద్ రూరల్: విద్యార్థులకు పూలతో స్వాగతం పలుకుతున్న డీఈవో, ఉపాధ్యాయులు



నర్మెట: విద్యార్థులకు పూలతో స్వాగతం పలుతుకున్న డీఈవో



## కేసీఆర్‌ను కలిసిన ఎర్రబెల్లి

దేవరుప్పుల/పెద్దవంగర, జూన్ 12: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకలు విజయవంతం కావడానికి కృషి చేసిన ఎర్రబెల్లిని అభినందించారు. అనంతరం రాష్ట్ర, ఉమ్మడి వరంగల్ జిల్లా, పాలకుర్తి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నట్లు దయాకర్‌రావు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం, కాళేశ్వరం కమిషన్ ఎదుట వాదనలు వినిపించడంలో బీఆర్‌ఎస్ పార్టీ సఫలీకృతులమైనట్లు చెప్పానన్నారు.

## నిధుల్లేక గ్రామాల్లో అటకెక్కిన అభివృద్ధి

- ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కరువు
- పనిభారంతో చేతులెత్తేసిన పంచాయతీ కార్యదర్శులు
- చెత్త సేకరణ ట్రాక్టర్లకు తాళం
- ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాల పరిస్థితి అధ్వానం



బెగులూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

# పల్లె పాలన అస్తవ్యస్తం



కార్యదర్శులు చేతులెత్తేయడంతో ఖాళీగా ఉన్న పంచాయతీ ట్రాక్టర్

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిధుల్లేక గ్రామాల అభివృద్ధి అటకెక్కింది. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడి పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పెరిగింది. కనీసం వీధి దీపాలు, బోర్ల మరమ్మతు, జీపీ ట్రాక్టర్లకు డీజిల్ కూడా కొనలేని పరిస్థితి ఉంది. ఇప్పటి దాకా సొంతంగా తమ జేబుల్లో నుంచి వేలాది రూపాయలు ఖర్చు చేసిన కార్యదర్శులు ట్రాక్టర్ల నిర్వహణ తమ వల్ల కాదని ఎంపీడీవోలకు వినతిపత్రాలు ఇస్తూ వాటికి తాళాలు వేసి అప్పగించారు. పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. సరైన నిర్వహణ లేక పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాల పరిస్థితి అధ్వానంగా తయారైంది. మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు సైతం చెల్లించలేని దుస్థితి నెలకొంది. - జయశంకర్ భూపాలపల్లి. జూన్ 12 (నమస్తే తెలంగాణ)**

గతేడాది జనవరి 31తో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి కాగా కాంగ్రెస్ ప్రభుత్వం క్లస్టర్ గ్రామాలు ఎంపిక చేసి ప్రత్యేక అధికారులను నియమించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తం 248 గ్రామ పంచాయతీల్లో వారికి బాధ్యతలను అప్పగించిన ప్రభుత్వం నిధులు, విధులపై స్పష్టత లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. గ్రామపంచాయతీల బ్యాంకు ఖాతాలు ఖాళీగా ఉండడంతో వీధి దీపాలు, బోర్ల మరమ్మతులు, పంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్ కొనేందుకు కూడా చిల్లిగవ్వ లేదు. ఉద్యోగులకు సైతం వేతనాలు చెల్లించలేని స్థితిలో పంచాయతీలు ఉన్నాయి.

### పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో పల్లెల్లో పడకేసిన పారిశుధ్యంతో వ్యాధుల ముప్పు పొంచి ఉందని వైద్యులు సూచిస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి పేరుతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. దీంతో గ్రామాల్లో, పట్టణాల్లో ఎలాంటి సమస్యలు లేకపోవడంతో వ్యాధుల జాడ కనిపించలేదు. పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలతో కొత్త శోభ సంతరించుకుంది. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. సర్పంచ్ పదవీకాలం పూర్తయిన 16 నెలల నుంచి అభివృద్ధికి ఎలాంటి నిధులు లేకపోవడంతో గ్రామాల్లో ఎక్కడ వేసి గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. నిధుల మంజూరు లేకపోవడంతో ప్రత్యేక అధికారులు సైతం చేసేదేమీ లేక కార్యదర్శులపై భారం మోపారు. పల్లెల్లో పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా కనిపిస్తున్నాయి. శ్మశాన వాటికలను పట్టించుకునేవారే లేరు.

### కార్యదర్శులపై పని భారం

హరిత హారం, ఉపాధి హామీ, పల్లె ప్రగతి, పన్నుల వసూలు, జనన మరణాల నమోదు , కల్యాణ లక్ష్మి.. ఇలా అనేక పనులతో పంచాయతీ కార్యదర్శిలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పెద్ద గ్రామ పంచాయతీల్లో తాగునీరు, ఇంటి పన్నుల వసూలు డబ్బులతో అత్యవసర పనులు చేసుకుంటుండగా , తక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో పరిస్థితి అధ్వానంగా మారింది. గతంలో చెత్త సేకరణకు కొనుగోలు చేసిన ట్రాక్టర్లు , ఆటోలకు పంచాయతీ నుంచి కిస్తులు చెల్లించడంతో ఖాతాలు ఖాళీ అయ్యాయి. గ్రామాల్లో కాల్వలు శుభ్రం చేయడం, తాగునీటి పైపు లైన్ లీకేజీలు సరిచేయడం, ట్రాక్టర్లలో డీజిల్ పోయించడం తదితర అత్యవసర పనుల కోసం కార్యదర్శులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ నిధులు రాకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు లేదని, ఉద్యోగులకు వేతనాలు సైతం నేరుగా వారి అకౌంట్లలోకే వెళ్తున్నాయని, తాము ఏమీ చేయలేమని జిల్లా పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు.



మహదేవపూర్ : జీపీ ట్రాక్టర్ల తాళాలను ఎంపీవో ప్రసాద్‌కు అప్పగిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

## 'చైతన్య'లో డిగ్రీ, ఫార్మసీ, ఇంజినీరింగ్ ఫలితాల విడుదల

హనుమకొండ చౌరస్తా, జూన్ 12: హనుమకొండ కిషన్‌పురలోని చైతన్య( డీమ్డ్ టు బీ విశ్వవి ద్యాలయం) డిగ్రీ, ఫార్మసీ, ఇంజినీరింగ్ పరీక్షల ఫలితాలను ఉపకులపతి ఆచార్య జీ శంకర్‌లింగం విడుదల చేశారు. డిగ్రీ 4, 6 సెమిస్టర్ పరీక్షల్లో మొత్తం 809 మందికి 641(79.23 శాతం) మంది ఉత్తీర్ణులైనట్లు, బీఫార్మసీ 8, 6 సెమిస్టర్‌లో 195 మందికి 52 (77.94) మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఫార్మ్‌డీ 3, 4, 5, 6వ సంవత్సరాల్లో మొత్తం 69 మందికి 65 (94.20) మంది ఉత్తీర్ణులైనట్లు, ఇంజినీరింగ్ 8, 6వ సెమిస్టర్ పరీక్షల్లో మొత్తం 385 మందికి 350 (90.90 శాతం) మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం రవీందర్, అడ్మినిస్ట్రేషన్ డీన్ ఆచార్య ఎస్ కవిత, చైతన్య డీమ్డ్ విశ్వవిద్యాలయ డిప్యూటీ పరీక్షల నియంత్రణాధికారులు, వివిధ శాఖాధిపతులు, డాక్టర్ బీ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న ఉపకులపతి శంకర్‌లింగం, అధ్యాపకులు

## కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలు

- జల దోపిడీపై ప్రజలు చైతన్యం కావాలి
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, జూన్ 12 : గోదావరి జలాలను ఆంధ్రా ప్రాంతానికి తరలించడానికి కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కారు అవినీతి కుట్రలు చేస్తుందని, రాష్ట్రంలో జరుగుతున్న జల దోపిడీపై రాష్ట్ర ప్రజలు, రైతాంగం చైతన్యం కావాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం నర్సంపేట పట్టణంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యనాయకుల అంతర్గత సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీ సీఎం చంద్రబాబుతో కుమ్మక్కై ఆంధ్రా ప్రాజెక్టులకు రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నాడని, తన గురువు చంద్రబాబు కోసం తెలంగాణ సీఎం కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. రెండేళ్ల నుంచి కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను పూర్తిగా వినియోగించకుండా రైతుల పొలాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎండబెట్టిందని మండిపడ్డారు. ఆంధ్రాలో నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టు కోసం గోదావరి నీటిని లిఫ్ట్ చేయడం లేదని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో కలిసి తెలంగాణలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్ట్‌లను ఎండబెట్టే ప్రయత్నం జరుగుతుందన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసే దేవాదుల ప్రాజెక్టు, సీతారామ ప్రాజెక్ట్, రామప్ప, పాకాల, రంగాయ చెరువు లాంటి ప్రధాన ప్రాజెక్ట్‌లు ఎండబెట్టే కుట్ర జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోని గోదావరి నదిపై నిర్మించిన ప్రాజెక్ట్‌లను ఎండబెట్టి ఆంధ్రా ప్రాంతంలో నిర్మిస్తున్న ప్రాజెక్ట్‌లకు నీటిని తరలించే కుట్రకు గురుశిష్యులు తెరలేపారని, గోదావరి జలాలపై తెలంగాణ నీటి వాటా కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్‌ను ఘోష్ కమిషన్ ముందుకు పిలిపించి రాక్షసానందం పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయలేక ప్రజలకు దూరంగా తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్మూ, ధైర్యం లేదని, పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నందునే స్థానిక ఎన్నికలను ఆలస్యం చేస్తున్నదన్నారు. గ్రామాలు, పట్టణాల్లో బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తుందని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని పెద్ది స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇండ్లు పేదలకు ఇవ్వరా..?

- గతంలో వచ్చిన వారికే మళ్లీ ఇస్తారా?
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డిని నిలదీసిన మహిళలు
- జనగామ జిల్లా లక్ష్మీనారాయణపురంలో చేదు అనుభవం

పాలకుర్తి, జూన్ 12 : పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. 'ఇందిరమ్మ ఇండ్లు పేదలకు ఇవ్వరా..?, గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో లబ్ధిపొందిన వారికే మళ్లీ ఇస్తారా' ..., అంటూ పలువురు మహిళలు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డిని నిలదీసి, నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. పాలకుర్తి మండలం లక్ష్మీనారాయణపురంలో గత ప్రభుత్వంలో మంజూరైన రూ.10 లక్షల సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతుండగా.. అదే గ్రామానికి చెందిన గుండె మణెమ్మ అలియాస్ మారమ్మ, బండిపెల్లి సాలమ్మ, సోమనర్సమ్మలు ఎమ్మెల్యేను ఉద్దేశించి 'అమ్మా మా గ్రామంలో అర్హులైన పేదలు ఉండగా ఒక్కరికీ కూడా ఇందిరమ్మ ఇల్లు రాలేదు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలకు నాయకులకే వచ్చాయి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడు ఇండ్లు తీసుకున్న వారికే ఇప్పుడు మళ్లా ఇండ్లు మంజూరు చేశారు.. ఇదేక్కడి న్యాయం' అంటూ ఎమ్మెల్యేను నిలదీసి, నిరసన తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ గెలిపిస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇతర పార్టీల వారికి ఇందిరమ్మ ఇండ్లు రావని చెప్పారు. వేరే పార్టీలకు ఓట్లు వేస్తే నిధులు రావన్నారు. ఎమ్మెల్యే సమాధానం చెప్పలేక ప్రసంగం మధ్యలోనే ముగించి, అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు. దీంతో ఎమ్యెల్యే తీరుపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే పేరుతో అధికారులు సైతం తప్పులు చేశారని గ్రామస్తులు మండిపడ్డారు.



గ్రామపంచాయతీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు, బీఆర్‌ఎస్ నాయకులు

## ఇండ్లు కాంగ్రెస్ వారికే ఇస్తారా?

**అర్హులకు ఇవ్వలేదని గ్రామస్తుల నిరసన**

తొర్రూరు, జూన్ 12 : తొర్రూరు మండలం చీకటాయపాలెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ వారికే ఇస్తారా?, అర్హులకు కేటాయించలేదని ఆరోపిస్తూ గ్రామస్తులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు గ్రామపంచాయతీ ఎదుట గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి మంజూరైన 21 ఇళ్లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలే ఉన్నాయన్నారు. అంతేకాకుండా గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పొందిన వారికే ఇప్పుడు మరోసారి ఇళ్లు రావడం దారుణమని పేర్కొన్నారు. భూములు, జాగలు ఉన్న వారికే మళ్లీ ఇళ్లు రావడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తండా కృష్ణయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై సంబంధిత అధికారులు తక్షణమే విచారణ చేపట్టి, అర్హులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బూర్గుల వెంకన్న, బూర్గుల దస్తగిరి, తండారామస్వామి, ఎండీ అబ్బాస్, పాండవుల వెంకన్న, ఉడుత లింగేష్ యాదవ్, అబ్బనబోయిన రామకృష్ణ, బీ ఉప్పలయ్య, రాధాబాబు, బీ వీరన్న, వీ కిశోర్, రాంబాబు, రామకృష్ణ, రేణుక, డీ సైదులు, శాంత పాల్గొన్నారు.

## ఇద్దరు ఐఏఎస్‌ల బదిలీ

- హనుమకొండ కలెక్టర్‌గా స్నేహా షబరీష్
- గ్రేటర్ వరంగల్ కమిషనర్‌గా చాహత్ బాజ్‌పాయ్



స్నేహా షబరీష్



చాహత్ బాజ్‌పాయ్

హనుమకొండ/వరంగల్, జూన్ 12 : నగరంలో ఇద్దరు ఐఏఎస్‌లు బదిలీ అయ్యారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య సంగారెడ్డి కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ స్నేహా షబరీష్‌కు హనుమకొండ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. కాగా ప్రావీణ్య గతంలో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, వరంగల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించి హనుమకొండ కలెక్టర్‌గా 2024 జూన్ 16న బాధ్యతలు స్వీకరించారు. సుమారు సంవత్సరం పాటు కలెక్టర్‌గా పనిచేసి జిల్లా ప్రజల మన్ననలు పొందారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంలో కృషి చేశారు. వరంగల్, హనుమకొండ జిల్లాలో మంచి పట్టున్న అధికారిగా పేరు గడించారు. కలెక్టర్‌గా ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి సఫలీకృతలయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేశారు. అదే విధంగా వరంగల్ మహానగరపాలక సంస్థ కమిషనర్‌గా 2019 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ నియమితులయ్యారు. ఈమె కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తుండగా గురువారం బదిలీ అయ్యింది. బాజ్‌పాయ్ గతంలో ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా, అసిఫాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేశారు. ఇప్పటి వరకు గ్రేటర్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన అశ్విని తానాజీ వాకడే కరీంనగర్ ఆదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గా బదిలీ అయ్యారు. ఈమె 15 నెలల పాటు పనిచేశారు. 2024 మార్చి 14వ తేదీన గ్రేటర్ వరంగల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

## విద్యుత్ ఉద్యోగుల క్రీడలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, జూన్ 12 : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ క్రీడలను గురువారం ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ప్రారంభించారు. ముందుగా స్పోర్ట్స్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ ఉద్యోగులు వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించడంలో భాగంగా ఒత్తిడి తగ్గించుకోవడానికి ఆటలు ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే వారికి క్రీడలతో మానసికంగా ప్రశాంతత, శారీరకంగా చురుకుగా ఉంటారన్నారు. క్రీడా పోటీల వల్ల విద్యుత్ శాఖల మధ్య మరింత స్నేహపూర్వక బంధం బలపడుతుందన్నారు. క్రీడల అంటే తనకు చాలా ఇష్టమని, గెలుపోటములు సహజమని, అందరూ టీం స్పిరిట్‌తో ఆడాలని పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో 12 కబడ్డీ జట్లు, బాల్ బ్యాడ్మింటన్ 9 జట్లు పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్లు బీ అశోక్‌కుమార్, టీ సదర్‌లాల్, వీ తిరుపతిరెడ్డి, హనుమకొండ ఎస్ఈ పీ మధుసూదన్‌రావు, డీఈ టెక్నికల్ ఏ విజయేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎన్ జగన్నాథ్, ట్రెజరర్ ఎం సంతోష్, కౌన్సిల్ మెంబర్స్ ఎండీ యాకూబ్‌పాషా, వీ సునీల్‌కుమార్, ఈ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేత ఝాన్సీ రెడ్డికి ఎదురుదెబ్బ

**హామీలపై తండావాసుల నిలదీత**

తొర్రూరు, జూన్ 12 : కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డికి ఎదురు దెబ్బ తగిలింది. గురువారం పల్లెబాట కార్యక్రమానికి రాగా, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై తొర్రూరు మండలంలోని గుడిబండ, వీధుల కుంట, పెద్దదుబ్బ తండాలోని గిరిజనులు నిలదీశారు. ఆరు గంటల విద్యుత్ ఎక్కడ?, 420 పథకం ఏమైంది?, ఆడబిడ్డలకు రూ. 2500, తులం బంగారం ఎక్కడ?, రైతులకు రైతుబంధు, బోనస్ ఎందుకు ఇవ్వలేదు?, గర్భిణులకు పౌష్టికాహారం లేదు, ధాన్యం తడిసి మొలకెత్తినా కొనుగోలు చేయలేదేంటి' అంటూ ప్రశ్నలు సంధించారు. ప్రజల ఆగ్రహానికి గురైన ఝాన్సీ రెడ్డి పది నిమిషాలకే కార్యక్రమాన్ని వదిలి కారులో వెళ్లిపోయారు. పల్లె బాట పేరుతో జనంలోకి వెళ్లే ప్రయత్నం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఆ ఘటన గట్టి హెచ్చరికగా మారిందని పలువురు పేర్కొంటున్నారు.

## నిషేధిత పత్తి విత్తనాలు పట్టివేత

**ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు**



పోలీసులు స్వాధీనం చేసుకున్న పత్తి విత్తనాలు

చిట్యాల, జూన్ 12 : పోలీస్, వ్యవసాయ శాఖ సంయుక్తంగా దాడులు జరిపి నిషేధిత పత్తి విత్తనాలను పట్టుకుని గురువారం ఇద్దరిపై కేసు నమోదు చేసింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నైన్‌పాక, కుమ్మరిపల్లి గ్రామాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన భిక్కనూరి విజయ్, నైన్‌పాక గ్రామానికి చెందిన సంఘ కుమార్‌ల ఇండ్ల వద్ద ప్రభుత్వ నిషేధిత R-COTT-999 BG5 32 ప్యాకెట్లు, క్యాప్టెన్ 5G 6 ప్యాకెట్లు లభ్యమయ్యాయి. రాష్ట్రంలో సేద్యానికి అనుమతి లేని పత్తి విత్తనాలను విక్రయిస్తున్నారని ఏవో శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు చేయగా సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రభుత్వ నిషేధిత పత్తి విత్తనాలు అమ్మితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.